క్లుప్తంగా

ఏరియా ఉత్పత్తి లక్ష్యంపై సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గనుల్లో నిర్దేశించే బొగ్గు ఉత్పత్తి లక్ష్యంపై బుధవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం జరిగింది. ఏరియా జీఎం మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కార్పొరేట్ నుంచి జీఎం (సీపీఅండ్‌పీ)జక్కం రమేష్, జీఎం(ఓసీపీలు) రాజు, జీఎం(భూగర్భ గనులు) అల్లి రాజేశ్వర్, జీఎం క్వాలిటీ (బెల్లంపల్లి రీజియన్)రవి పాల్గొన్నారు. ఏరియాలోని గనుల ప్లాన్‌లను, సామర్థ్యలను పరిశీంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే అన్ని గనులను సందర్శించి ఉత్పత్తి లక్ష్యాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, ఏజెంట్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాసోత్సవాల సందర్భంగా కాలనీలోని చిన్నారులకు అన్నప్రాశన చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కాలనీ మహిళలు, కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దాసరి లక్ష్మీ, శారద, స్రవంతి పాల్గొన్నారు.

‘చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్ మాదిగలకే కేటాయించాలి’

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ అన్ని పార్టీలు మాదిగ కులస్తులకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య పేర్కొన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు 43వేలకు పైగా మాదిగల ఓట్లున్నాయని, అన్ని పార్టీల అదిష్టానం ఈ విషయాన్ని గ్రహించి మాదిగ కులస్తులకే టికెట్ కేటాయిస్తే గెలిపించుకుంటామన్నారు.

‘సబ్‌స్టేషన్ ఏర్పాటుపై స్పందించాలి’

జన్నారం: మండలంలోని విద్యుత్ సమస్యను అధిగమించేందుకు జన్నారంలో 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరహార దీక్షపై ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ స్పందించి, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలేందర్ అలీఖాన్, మండల కన్వీనర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. భూమాచారి చేపట్టిన దీక్షలో బుధవారం పాల్గొని మద్దతు తెలిపారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం ఆత్మహత్యల నివారణపై సైక్రియాటిస్టు డాక్టర్ సునిల్, సీహెచ్‌వో లింగారెడ్డి అవగాహన కల్పించారు. పాతమంచిర్యాల ప్రభుత్వ పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో మానసిక నైపుణ్యతను పెంచి, మంచి ఆలోచనలను కలిగి ఉండేలా, చెడుకు దూరంగా ఉండేలా వారిని సరైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, పాతమంచిర్యాల ప్రధానోపాధ్యాయుడు భీమరావు, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

చిత్తాపూర్ సర్పంచ్‌ను అభినందించిన ఎమ్మెల్యే



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ సర్పంచ్ బత్తిని పద్మను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బుధవారం సన్మానించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో అవార్డు పొందిన ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పారిశుధ్య నిర్వహణలో గ్రామ స్వచ్ఛతకు పాటుపడి, ఉత్తమ ప్రతిభకనబర్చిన సర్పంచ్‌ను మిగితా సర్పంచ్‌లు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, ఆత్మ చైర్మన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యానికి సుస్తీ!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ముక్కెర మల్లేశ్. జన్నారం మండల కేంద్రానికి చెందిన ఈయన అనారోగ్యంతో బాధపడుతున్న తన బంధువులను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ఎవ్వరూ లేరు. ఆసుపత్రికి తాళం వేసి ఉంది. తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

- 70 వేల జనాభాకు ఒక్కటే పీహెచ్‌సీ
- అత్యవసరమైతే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే..
- ఐదేళ్లుగా కలగానే 30పడకల ఆస్పత్రి
- అసెంబ్లీలో ప్రకటించినా కానరాని చర్యలు



జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి

జన్నారం: మండలంలో 29గ్రామ పంచాయతీలుండగా, సుమారు 70వేల వరకు జనాభా ఉంది. విస్తీర్ణం పరంగా చాలా పెద్దది. ఇక్కడ అత్యధిక మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. పాలకులు ఆసుపత్రి స్థాయిని 30పడకలకు పెంచుతామని చెప్పిన హామీ కలగానే మిగిలింది. మండలంలోని లోతొర్రే, సోనాపూర్ తాండా, బంగారుతాండా, హస్టల్ తాండా, రాగికుంట, కొలాంగూడ, మల్యాల, అలీనగర్, దొంగపల్లి, బొమ్మెన గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఆదివాసీ, గిరిజనులు నివాసం ఉంటారు. అత్యధిక ప్రజలు నిరుపేదలే ఉన్నారు. అనారోగ్యం భారిన పడితే ఖరీదైన వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉంది. ఇంతమంది జనాభాకు జన్నారం మండలంలో ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. జ్వరం, విరేచనాలకు తప్పా ఇక్కడ వైద్యం జరగదు. అత్యవసరమైతే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సిబ్బంది కొరత కూడా వెంటాడుతోంది.

ఆసుపత్రి స్థాయి పెంచితే...

అత్యవసరంగా ఆసుపత్రికి వస్తే సిబ్బంది అందుబాటులో ఉండరు. రాత్రి అయితే ఇక్కడ సేవలందించరూ. ఇలాంటి సమయంలో ఆసుపత్రి స్థాయి పెంచితే నిరుపేద ప్రజలకు వైద్య సేవలందే అవకాశం ఉంది. ఆసుపత్రి స్థాయిని 30పడకలకు పెంచాలని కొన్ని సంవత్సరాలుగా మండల ప్రజలు ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకుంటున్నారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రేఖానాయక్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. సంవత్సరం క్రితం ఎమ్మెల్యే ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. 30పడకల ఆసుపత్రి స్థాయి పెంచుతామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆసుపత్రి స్థాయి పెంపు డిమాండ్ పెరుగుతోంది. కేవలం కొన్ని సేవలకే పరిమితమైన ఆసుపత్రి స్థాయి పెంచి, మండల ప్రజలకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైద్యసేవలందేలా చూడాలి



మండలంలో అత్యధిక జనాభా ఉండటం, అందులో పేదవారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని దుస్థితి ఉంది. ఈ క్రమంలో ఆదివాసీ, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచి, వైద్య సేవలు అందేలా చూడాలి.

– దుమల్ల రమేష్, పొనకల్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



జన్నారం మండలంలో అత్యధిక జనాభా ఉంది. ఎక్కువ మంది నిరుపేదలే ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రిని 30పడకల ఆసుపత్రిగా మార్చాలని ఇప్పటికే పలుమార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నందునా, అధికార పార్టీ అభ్యర్థి దృష్టికి కూడా తీసుకెళ్లాను. ఈ విషయాన్ని మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రి స్థాయి పెంచాలని విన్న విస్తాను.

– ఎర్ర చంద్రశేఖర్, జెడ్పీటీసీ

ఓటరు నమోదు, సవరణపై అవగాహన



హాజీపూర్‌లో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: ఓటు నా జన్మహక్కు–ఓటు నా భవిష్యత్ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని ఎన్నికల సమయంలో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్‌ఓలు కీలకపాత్ర పోషించాలని మంచిర్యాల ఆర్డీఓ రాములు అన్నారు. హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులతో పాటు ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలలో యువత చేతిలో దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. హాజీపూర్‌లో తహసీల్దార్ సతీశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్‌లు ప్రభు, మంగ, బీఎల్‌ఓలు పాల్గొనగా, లక్సెట్టిపేటలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, ఎంఈవో రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: కలెక్టరేట్‌లో ఈ నెల 17న విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్ల సంతోష్ చారి తెలిపారు. సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆయన సీసీసీలోని బీసీ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ అధికారి భాగ్యవతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మట్టెల రమేశ్ చారి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎర్రోజు వేణుగోపాల చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధుచారి, నాయకులు రాజన్న చారి, వీరాచారి, జగదీశ్వరచారి, రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



చెన్నూర్: మాట్లాడుతున్న సీఐ వాసుదేవరావు



కాసిపేట: మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

చెన్నూర్/కాసిపేట/వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణేశ్ ఉత్సవాలు పజ్రలు ప్రశాంత వాతారణంలో జరుపుకోవాలని పోలీసులు సూచించారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేశ్ మండల నిర్వాహకులతో, ముస్లిం మత పెద్దలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో సీఐ వాసుదేవరావు, కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుబ్బారావు, హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నరేశ్‌కుమార్ అవగాహన కల్పించారు. విగ్రహాల ప్రతిష్ట ఊరేగింపు, నిమజ్జన సమయాల్లో ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద ఆ ప్రాంత వాసులు ఒక కమిటీగా ఏర్పడి మండపం వద్ద ఎలాంటి వివాదాలు, అల్లర్లు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద భక్తి పారవశ్యంతో కూడిన కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎస్సైలు శ్వేత, గంగారాం, పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి’



బెల్లంపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బుధవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీక్షకు సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాతరి స్వామి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నరాజం, రత్నం ఐలయ్య, శేఖర్, రాజలింగు, అరుణ్, శంకర్, గణేష్, కృష్ణ, ఉదయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ అందజేత



వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న డీఈవో

మంచిర్యాలటౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏసీసీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను 5సంవత్సరాలకు గాను దత్తత తీసుకుని విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా రూ.25వేల వాటర్ ఫిల్టర్‌ను బుధవారం డీఈవో యాదయ్య చేతుల మీదుగా ప్రారంభించారు.

కొనసాగుతున్న దీక్షలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం కొనసాగాయి. భారత జాగృతి బాధ్యులు దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

పత్తి పంట సంరక్షణపై సూచనలు

కోటపల్లి: పత్తిపంట సంరక్షణ, తెగులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కోటపల్లి ఏవో మహేందర్ రైతులకు సూచనలు చేశారు. మండలంలోని సర్వాయిపేట, నాగంపేట పత్తిక్షేత్రాలను సందర్శించిన ఏవో మొక్కల ఎదుగుదలకు పోషకాలను ఎరువుల రూపంలో అందించాలన్నారు. పత్తిలో కలుపు ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు.

పంటల సాగులో రక్షణ చర్యలు చేపట్టాలి

చెన్నూర్‌రూరల్: పంటల సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కవిత సూచించారు. మండలంలోని నాగాపూర్‌లో సాగుచేస్తున్న ఆయిల్ పాం పంటను అలాగే అంతర్గత పంటగా సాగు చేస్తున్న పత్తి పంటను బుధవారం ఆమె పరిశీలించారు. రైతులకు ఆయిల్‌పాం పంట ప్రాముఖ్యత, పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వేమనపల్లిలో ముసురు

వేమనపల్లి: వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో బుధవారం నీల్వాయి వాగు వంతెన అప్రోచ్‌రోడ్డు కోతకు గురైంది. వర్షంతో వేమనపల్లి సమీపంలోని మత్తడి వాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు సైతం బురదగా మారింది. ముల్కలపేట, రాచర్ల మధ్యలో ఉన్న బొందచేను వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులతో రోడ్డు బురదమయంగా మారింది.

‘ఆపరేటర్‌ను తొలగించాలి’

బెల్లంపల్లిరూరల్: తహసీల్దార్ కార్యాలయంలో కుల ధృవీకరణ పత్రాల జారీలో వసూళ్లు చేపడుతూ అక్రమాలకు పాల్పడుతున్న కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

‘ఆయుష్మాన్ భవ’తో మేలు

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎంపీపీ గుర్రం మంగ, వైద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం రాష్ట్రపతి ద్రౌపతిముర్ము ప్రారంభించిన కార్యక్రమాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో శశికళ తదితరులు టీవీలో తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భవ ద్వారా పలు అనారోగ్య సమస్యలున్న వారికి కేంద్ర ప్రభుత్వం ఇన్సురెన్స్ అందిస్తుందని, ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భవ కార్డు అందేలా చూడాలని వివరించారు.

ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పేదల అభివృద్ధికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు విలేజ్ నస్పూర్‌లో బుధవారం ఆయన ఇంటింటికీ బీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి గెలింపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్లు , నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తీర్చాలని వినతి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కార్మికులు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి వెంకటి, గోగర్ల ఆశయ్య, చిప్పకుర్తి నర్సయ్య, కోకిల శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అద్భుతమైన విజయం అందించాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజీపూర్ మండల సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నివాస గృహంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముందుగా రానున్న ఎన్నికల్లో విజయం సాధించడానికి ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశాలపై నాయకులు, కార్యకర్తల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తూ అందరికీ దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లి చైతన్యం చేయాలని సూచించారు.

‘సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం’



దండేపల్లి: మద్దతు తెలుపుతున్న నాయకులు



జన్నారం: సమ్మెలో పాల్గొన్న సీపీఐ నాయకులు

దండేపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దండేపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న రిలే దీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. దీక్షకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలీందర్‌ఖాన్, నాయకులు మద్దతు తెలిపారు.

జన్నారం: అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు నెరవేర్చే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలీందర్ అలీఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు.

బెల్లంపల్లిరూరల్: సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు ఆయన పార్టీ నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు.

కాసిపేట: అంగన్‌వాడీల సమ్మెను బుధవారం బీజేపీ నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్, మండల ప్రధానకార్యదర్శి సంతోష్, మండల ఉపాధ్యక్షుడు నరేష్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ అరవింద్ రెడ్డి బాలరాజు, రాంచందర్, యూసఫ్, విష్ణువర్ధన్, తదితరులున్నారు.

రేషన్ డీలర్లే.. కమీషన్ ఏజెంట్లు!

- జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా

దండేపల్లి: మండలంలో రేషన్‌బియ్యం అక్రమదందా జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వినియోగదారులకు బియ్యం పంచాల్సిన కొంతమంది రేషన్ డీలర్లే కమీషన్ ఏజెంట్లుగా అవతారమెత్తుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దండేపల్లి మండలంలో 34రేషన్ దుకాణాలు ఉండగా, కొందరు బియ్యం పంచకుండా, బయోమెట్రిక్‌తో విని యోగదారుల వేలిముద్రలు వేయించుకొని వారికి ఇవ్వాల్సిన, బియ్యానికి బదులు నగదును అందించి, ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నగదుబదిలీ పథకాన్ని దండేపల్లి మండలంలో కొందరు డీలర్లు ముందే అమలు చేస్తున్నట్లుగా సమాచారం. కిలో బియ్యాన్ని రూ.10నుంచి రూ.13వరకు వెచ్చించి వినియోగదారులకు నేరుగా, బియ్యానికి బదులు నగదు అందిస్తున్నట్లు తెలిసింది. తాము కొనుగోలు చేసిన బియ్యాన్ని ఇతర వ్యాపారులకు కిలోకు రూ.15నుంచి రూ.17వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు వినికిడి. కొంతమంది డీలర్లు ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుంచి తక్కువ స్టాక్ తెచ్చి, కొంత స్టాకును అక్కడే అమ్మేస్తున్నట్లుగా సమాచారం. ఈ విషయంలో అధికారులు స్పందించి రేషన్ అక్రమదందాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని ఫోన్లో సంప్రదించగా, దీనిపై దృష్టిసారించి తనిఖీలు చేపడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

పేదింటి ఆడపిల్ల పెళ్లికి సాయం

జన్నారం: నిరుపేద కూతురు వివాహానికి క్వింటాల్ బియ్యం అందజేసి, ఎస్సై, ప్రెస్‌క్లబ్ సభ్యులు తమ ఉదారత చాటారు. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన బెడగల రాజు, వసంతల కూతురు రాజేశ్వరి వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఖర్చులకు వారి వద్ద డబ్బులు లేకపోవడంతో దాతల సాయం కోరారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్, జన్నారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యం, కలమడుగుకు చెందిన స్వదేశ్‌కుమార్ భోజనం ఖర్చు కోసం రూ.2500 అందజేశారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, యువసేనా నాయకుడు ఫజల్‌ఖాన్ పుస్తే, మట్టెలు అందజేశారు. నియోజకవర్గంలో ఏ పేదింటి అమ్మాయి వివాహం కోసం తనను సంప్రదిస్తే పుస్తెమట్టెలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఫజల్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు కాంతయ్య, లింగన్న, సత్యనారాయణ, వెంకట్ పాల్గొన్నారు.

శానిటేషన్ సక్రమంగా చేపట్టాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో శానిటేషన్ పనులు సక్రమంగా చేయించాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సురేందర్ బుధవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెన్నెల: మండలంలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా నెన్నెల, కన్నెపల్లి పాఠశాలల నుంచి 925మంది పాల్గొన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థ మండల కన్వీనర్ ఎస్.వెంకన్న తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం ఘనంగా జాతీయ హిందీ దివస్ నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

‘డబుల్ ఓటర్లు లేకుండా చూడాలి’

మంచిర్యాలటౌన్: మండలంలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఓటు నమోదు కోసం ఇటీవల సేకరించిన ఫారంలతో పాటు, డబుల్ ఓట్లు, చనిపోయిన వారు, ఇతర చోటుకు వెళ్లిన వారి ఓటర్ల తొలగింపును సక్రమంగా చేసి, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని తహసీల్దార్ భోజన్న అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాలటౌన్: ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ అసోసియేషన్ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ వలబోజు మోహన్‌రావు, గుండా రవీందర్, దుర్గాప్రసాద్ బుధవారం హెల్త్ డైరక్టర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు.

‘వందశాతం ఓటింగ్ కోసం కృషి చేయాలి’

భీమారం: రానున్న ఎన్నికల్లో ప్రతి బూత్‌లో వందశాతం పోలింగ్ అయ్యేలా కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు.

‘మరోసారి దివాకర్‌రావును గెలిపించాలి’

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో మరోసారి నడిపెల్లి దివాకర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన తనయుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు విజిత్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వినతిపత్రం అందజేత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరులో ఉన్నటువంటి మీ సేవా కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందించారు.